క్లుప్తంగా

కమిషనర్ ప్రత్యేక పూజలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకొని మునిసిపల్ కమిషనర్ హెచ్ ఎం ధ్యానచంద్ర దంపతులు శ్రీకాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. దేవతామూర్తులకు పాలాభిషేకం చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనం అందజేశారు. అదేవిధంగా శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి 11 రకముల ద్రవ్యములతో సర్ప సూక్త సహిత రుద్రాభిషేకం నిర్వహించారు. 10మంది జంటల చేత స్వామివార్ల కళ్యాణం జరిపించారు. స్థానిక కార్పొరేటర్ బాలస్వామి, ఆలయ ఈఓ వై.సీతారామయ్య, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే చర్యలు

పటమట(విజయవాడతూర్పు): ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే కఠినమైన చర్యలు తప్పవని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్చరించారు. నగర పర్యటనలో భాగంగా శనివారం ఆయన పటమట 12వ డివిజన్ అయ్యప్పనగర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. వ్యాపారసంస్థల ట్రేడ్ లైసెన్స్‌లను ~నిఖీ చేశారు. పలువురు వ్యాపారులకు లైసెన్స్ లేకపోవడం గమనించి వారిని వెంటనే లైసెన్స్ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డివిజన్లలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, సైడ్ డ్రైన్‌లో తరచుగా సిల్టు తొలగించాలని సూచించారు. ఆయన వెంట చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్, ఇంచార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు ఉన్నారు.

క్రీడా మహోత్సవాలు ప్రారంభం




గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి ఎంతగానో తోడ్పడతాయని క్రైడాయ్ ప్రెసిడెంట్ వైవీ రమణరావు అన్నారు. ఏలూరు రోడ్డులోని ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహిస్తున్న 9వ వార్షిక క్రీడామహోత్సవాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడాలకు ప్రాధాన్యం ఇవ్వాలలని సూచించారు. క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. స్కూల్ డైరెక్టర్లు మాట్లాడుతూ ఐకాన్ పబ్లిక్ స్కూల్ స్థాపించిన నాటి నుంచి క్రీడా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని వివరించారు. విద్యార్థుల డ్రిల్, నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వెస్టిన్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ సీఈఓ కె.దుర్గాప్రసాద్, ఐకాన్ స్కూల్ డైరెక్టర్లు వై.పార్థసారధి, కె.రాజేంద్ర, కృష్ణమోహన్, వై.స్వరూప, పి.వి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గాయకుడు సాయికృష్ణకు కెఫా పురస్కారం



విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన యువ గాయకుడు అయ్యప్పన్ సాయికృష్ణకు ప్రతిష్టాత్మకమైన కెఫా(కరణం ఎంటర్‌టైన్‌మెంట్ ఫిలిమ్‌అవార్డ్) లభించినట్లు శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన కెఫా ఏటా షార్ట్ ఫిలిమ్స్ విభాగంతోపాటు ఆఫిలిమ్‌లో పాటలు పాడిన వారిని అవార్డ్‌కు ఎంపిక చేస్తుంది. 2024 సంవత్సరానికి గానూ ఊరంతా ప్రేమకథలో పాట పాడినందుకు బెస్ట్ ప్లేబాక్ సింగర్ అవార్డ్‌కు అయ్యప్పన్ సాయికృష్ణ ఎంపికయ్యారు హైదరాబాద్ లలిత కళాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో సినీ గాయకుడు నిహాల్ చేతులమీదుగా సాయికృష్ణ అవార్డు అందుకున్నారు. గాయకుడు సాయికృష్ణను జిల్లా కలెక్టర్ లక్ష్మీశా, నగరానికి చెందిన సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు విజయలక్ష్మి, ప్రసూనా రామన్, ముష్టి శ్రీనివాస్, మీరా కుమార్ అభినందించారు.

అలరించిన సంగీత కచేరి



విజయవాడ కల్చరల్: స్థానిక దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత ఉత్సవాల్లో భాగంగా శనివారం చెన్నైకి చెందిన సాంతూర్ కృష్ణ రామరత్నం ఆలపించిన సంప్రదాయ కీర్తనలు అందరినీ అలరించాయి. పెరవలి నందకుమార్, పెరవలి విజయభాస్కర్, కే హరిబాబు వాద్య సహకారం అందించారు. స్వరఝరి కార్యదర్శి మోదుమూడి సుధాకర్ కృష్ణ రామరత్నం సంగీత విశేషాలను వివరించారు. సంగీత విద్వాంసుడిని ఆత్మీయంగా సత్కరించారు. అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాద్ పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న ఇన్నర్ రింగ్‌రోడ్డు

- వరదల సమయంలో పలుచోట్ల రోడ్డు పగలకొట్టిన అధికారులు..
- తూతూమంత్రంగా మరమ్మతులు
- వెలగని సెంట్రల్ లైట్లు
- తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- తీవ్ర ఇబ్బందుల్లో ప్రయాణికులు



గ్యాస్ గోడౌన్ సమీపంలో ఇన్నర్‌రింగ్ రోడ్డు దుస్థితి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): జక్కంపూడి వైఎస్సార్ కాలనీ నుంచి సింగ్‌నగర్ పైపుల రోడ్డు వరకూ ఉన్న ఇన్నర్ రింగ్‌రోడ్డు ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. నిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగించే ఈ రోడ్డుపై ఉన్న గోతుల కారణంగా నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో ఇన్నర్ రింగ్ రోడ్డుపైకి రావాలంటేనే వాహనచోదకులు భయాందోళనకు గురవుతున్నారు.

మరమ్మతులు మమ..

బుడమేరు వరద ముంపు సమయంలో అంబాపురం పంచాయతీ ప్రాంతంలో నిలిచిపోయిన వరద నీరు బయటికి వెళ్లేలా ఇన్నర్ రింగ్ రోడ్డును పది చోట్ల పగలకొట్టారు. అక్కడి నుంచి ఆ వరద నీటిని సింగ్‌నగర్ వైపునకు మళ్లించారు. అయితే వరదలు ముగిసిన తరువాత పగలకొట్టిన ఇన్నర్ రింగ్‌రోడ్డుకు మరమ్మతులు సరిగా చేయలేదు. రోడ్డు మరమ్మతులను తూతూమంత్రంగా చేపట్టి తారువేసేసి మమ అనిపించారు. దీంతో రోడ్డు పగులకొట్టిన ప్రాంతాల్లో గుంతలను కొన్నిచోట్ల రోడ్డుకు సరిపడా లెవల్‌లో పూడ్చకపోవడం..మరికొన్ని చోట్ల రోడ్డు ఎత్తుకంటే ఎక్కువ ఎత్తు ఉండేలా పనులు చేశారు. దీంతో వాహనదారులకు అవి కనబడకపోతుండటంతో వాటివద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా వాహనం అదుపుతప్పి పక్కకు ఒరిగిపోవడం, రోడ్డు వెంబడి డివైడర్లను ఢీకొంటున్నాయి. దీంతో వాహనచోదకులు గాయాలపాలవుతున్నారు. అదేవిధంగా పగులకొట్టిన చోట్ల రోడ్డు వెంబడి మట్టిని పూడ్చకుండా పెద్దఎత్తున గోతులను అలానే వదిలేశారు. దీంతో ఏమాత్రం ఆదమరచి ముందుకు వెళ్లినా పెద్ద ప్రమాదాలే చోటుచేసుకుంటాయి.

రాత్రులు ప్రయాణం సాహసమే:

ఇన్నర్ రింగ్‌రోడ్డుపై రాత్రుల సమయంలో ప్రయాణం అంటే పెద్ద సాహసంగా మారింది. రోడ్డు మధ్యలో ఉన్న సెంట్రల్ లైట్లు సరిగా వెలగకపోవడంతో ఈ రోడ్డంతా అంధకారంగా మారింది. దీంతో వాహన చోదకులు రాత్రుల సమయంగా అధికంగా ప్రమాదాలకు గురవుతున్నారు. గత నెల 27వ తేదీన ఓ యువకుడు బైకుపై వస్తూ ఈ రోడ్డుపై ఉన్న గోతులను కనబడకపోవడంతో ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతిచెందగా, ఈనెల 1వ తేదీన అంబాపురం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి తన భార్యా, పిల్లను ఎక్కించుకొని వెళ్తూ విక్రమ్ పబ్లిషర్స్ దాటగానే రోడ్డు పగలకొట్టిన ప్రదేశంలో అదుపుతప్పి కింద పడిపోయారు. అదేసమయంలో వెనుక నుంచి ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. ఈనెల 5వ తేదీన ఇద్దరు వ్యక్తులు కూలి పనులకు వెళ్లివస్తూ ఈ రోడ్డులో ప్రమాదానికి గురయ్యారు. ఇలా తరచూ ఈ రోడ్డుపై ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో వాహనచోదకులు, ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఇన్నర్ రింగ్‌రోడ్డుపై ఉన్న గోతులను పూడ్చి, ఎగుడుదిగుడుగా ఉన్న ప్రాంతాలను సరిచేయించాలని ప్రజలు కోరుతున్నారు.



విక్రమ్ పబ్లిషర్స్ సమీపంలో ఇన్నర్ రింగ్ రోడ్డును తవ్వి వదిలేసిన దృశ్యం

ప్రధాన రహదారిపై నిర్లక్ష్యం తగదు..



సింగ్‌నగర్, పాయకాపురం, జక్కంపూడి, అంబాపురం ప్రాంతాలకు ముఖ్యమైన రోడ్డయిన ఇన్నర్ రింగ్‌రోడ్డులో ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలి. రోడ్డుకు ఆయాచోట్ల మరమ్మతులు చేయాలి.

– శాసనాల బోసుబాబు, సింగ్‌నగర్

సెంట్రల్ లైట్లు వెలిగేలా చూడాలి



ఈ రోడ్డును పగలకొట్టిన చోట్ల పదిహేను అడుగుల లోతులో గోతులను పూడ్చకుండా అలానే వదిలేశారు. రాత్రుల సమయంలో సెంట్రల్ లైట్లు సరిగా వెలగకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. లైట్లు వెలిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సురేష్, మధురానగర్

13న రైతు సమస్యలపై నిరసన కార్యక్రమం
మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): రైతుల విషయంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈనెల 13న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటానికి సిద్ధమైందని వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక అన్నదాతలను రోడ్డున పడేసిందన్నారు. తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తాయని తెలిసినా, రైతులను అప్రమత్తం చేయలేదని మండిపడ్డారు. ఫలితంగా రైతులు పగలూరాత్రీ తేడా లేకుండా ధాన్యం రాశుల వద్ద రోజులతరబడి కాపలా కాయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. పంటల కొనుగోలు ప్రణాళిక రూపకల్పనలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని దుయ్యబట్టారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పంట కోతకొచ్చే సమయానికి మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేసిందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంలో మద్దతు ధర దక్కడం రైతులకు ఎండమావిగా మారిందని మల్లాది విష్ణు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని అవకాశంగా చేసుకుని దళారులు, మిల్లర్లు రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారన్నారు. బస్తాకు రూ.300-రూ.400 నష్టానికి రైతులు ధాన్యం అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అన్నదాతల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 13న కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టరర్లకు వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. నిరసన కార్యక్రమంలో రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

పారిశుద్ధ్య నిర్వహణపై సమీక్ష



ప్రజారోగ్య విభాగంపై సమీక్ష చేస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, డివిజన్లలో వ్యర్థాలు పేరుకుపోయిన ప్రాంతాలను గుర్తించేందుకు సిబ్బంది డ్రోన్లను వినియోగించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయం నూతన భవనంలోని సమావేశ మందిరంలో ప్రజారోగ్య విభాగం అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ల ద్వారా వ్యర్థాలు పేరుకుపోయిన ప్రాంతాలను గుర్తించి, స్పెషల్ డ్రైవ్ ద్వారా తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పాత్ర కీలకమని, అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ లోపం లేకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు కావాల్సిన తోపుడు బండ్లు, వ్యర్థ సేకరణ వాహనాలు సమకూర్చుకోవాల్సిన బాధ్యత సిబ్బందిదేనని స్పష్టం చేశారు. డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న ట్రేడ్ లైసెన్స్ రుసుం వసూలు చేయాలన్నారు. వ్యర్థాలను తరలించే వాహనాలపై నల్లటి కవర్ కప్పాలని, వ్యర్థాలు ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరిండింటింగ్ ఇంజనీర్ పీ సత్యకుమారి,అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ రామకోటేశ్వర రావు, డాక్టర్ బాబు శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇంచార్జ్ వెహికల్స్ ఏసుదాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్ల సహకారంతో సైబర్ నేరాల నియంత్రణ

పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు



గవర్నర్‌పేట బీఓబీ అధికారులను సత్కరిస్తున్న పోలీస్‌కమిషనర్ రాజశేఖరబాబు

విజయవాడస్పోర్ట్స్: ముందస్తు అవగాహన, జాగ్రత్తలు పాటించడం ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. భారీ సైబర్ నేరం జరగకుండా అడ్డుకున్న బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ)గవర్నర్‌పేట బ్రాంచ్ మేనేజర్ సూర్యనారాయణ, అధికారులు ఆంజనేయులు, భానులను శనివారం తన కార్యాలయంలో కమిషనర్ రాజశేఖరబాబు ఘనంగా సత్కరించారు. కమిషనర్ మాట్లాడుతూ ఈనెల ఆరో తేదీన ఓవ్యక్తి కంగారుగా బ్యాంక్‌కు వచ్చి తనఖాతాలోని నగదును వేరే వ్యక్తి ఖాతాలోకి బదిలీ చేయాలని బ్యాంకు అధికారులు ఆంజనేయులు, భానులను కోరగా అనుమానం వచ్చిన వారు ఈ విషయాన్ని వెంటనే మేనేజర్ సూర్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారన్నారు. గతంలో బ్యాంకు సిబ్బందికి తాము ఇచ్చిన ప్రశ్నావళి ఆధారంగా సదరువ్యక్తి సైబర్ నేరానికి గురయ్యాడని మేనేజర్ గ్రహించి వెంటనే అతని బ్యాంకుఖాతాను సీజ్ చేసి నగదు వేరే ఖాతాలకు బదిలీ కాకుండా జాగ్రత్తలు తీసుకున్నారని అభినందనీయమన్నారు. డిజిటల్ అరెస్ట్, కస్టమ్ అధికారుల పేరుతో వస్తున్న ఫేక్ ఫోన్‌కాల్స్‌ను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. పోలీస్‌శాఖ, బ్యాంకు సిబ్బంది సమన్వయంతో వ్యవహరిస్తూ ఇటువంటి సైబర్ నేరాలు జరుగకుండా అడ్డుకోవాలని బ్యాంకర్లను కోరారు.

పాఠశాలల బలోపేతానికి సహకరించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సత్యనారాయణ, హర్షియా తదితరులు



పాయకాపురంలో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ దేవి, టీచర్లు



బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ మల్లీశ్వరి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పాఠశాల బలోపేతానికి అందరూ సహకరించాలని ఎస్‌పీఆర్ ఎంసీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం షేక్ హర్షియా కోరారు. స్థానిక సీతన్నపేట గేటు వద్దగల ఎస్‌పీఆర్ ఎంసీ పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పారిశ్రామికవేత్త చింతలపూడి సత్యనారాయణ, లయన్స్ క్లబ్ జూబ్లి అధ్యక్షుడు జి.రామారావు, కార్యదర్శి శ్రీనివాసచౌదరి హాజరయ్యారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. చింతలపూడి బాబు, ఎస్.శేఖర్‌రెడ్డి, కె.రాజేష్, ఉపాధ్యాయులు డి.అమృత, మేరిరాణి, ఐఈఆర్‌టి. కె. వెంకటసుధ, జె.కుమార్ మధు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలకు చేరగలం..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరిపేటలోని కేర్‌అండ్ షేర్ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సింగ్‌నగర్ సీఐ బీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రమశిక్షణతోనే ఆయా రంగాల్లో ఉన్నత శిఖరాలకు చేరుకోగలమని విద్యార్థులకు సూచించారు. హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, కార్పొరేటర్ ఇసరపు దేవి, మాజీ ఫ్లోర్ లీడర్ ఎరుబోతు రమణారావు, ఎస్సై పీపీ రామారావు, భాస్కరరావు, హనుమప్రసాద్, లత, స్వాతి పాల్గొన్నారు. అదేవిధంగా సింగ్‌నగర్ ఎంకే బేగ్ స్కూల్, వివేకానంద సెంటినరీ స్కూల్, పాయకాపురం పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్, వాంబేకాలనీ జంధ్యాల దక్షిణామూర్తి హైస్కూల్, కండ్రిక బీపీ సుబ్బారెడ్డి హైస్కూల్స్‌లో ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు.

ఎస్‌టీవీఆర్ పాఠశాలలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక దుర్గాపురం ఎస్‌టీవీఆర్ నగరపాలక సంస్థ పాఠశాలలో శనివారం మెగా పేరెంట్, టీచర్స్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి, సీఐ షేక్ అహ్మద్‌ఆలీ , హెచ్‌ఎం సూర్యప్రభ, గుండు దిలీప్, ఎస్‌ఎంసీ చైర్మన్ మజ్జి శంకరరావు, ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీ రూప, ఉపాధ్యాయులు ఎంజీపీ కుమార్, పీ శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మన మిస్సైల్ మ్యాన్..హుస్సేన్

- లాంతరు వెలుగులో చదివి..జిల్లా సైన్స్ అధికారి స్థాయికి ఎదిగి..
- మూడుసార్లు 'ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక
- మూడు జాతీయ అవార్డులు ఆయన సొంతం



నాటి సీఎం వైఎస్ జగన్ చేతులమీదుగా ఉత్తమటీచర్ అవార్డును అందుకుంటున్న హుస్సేన్



పరిశోధనలపై విద్యార్థులకు మెలకువలు నేర్పిస్తున్న హుస్సేన్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అతను పుట్టింది ఓ నిరుపేద కుటుంబంలో.. పెరిగింది ఓ పూరి గుడిసెలో..వీధిలైట్లు కాదు..అసలు కరెంట్ తీగలే లేని కుగ్రామమే అతని చిరునామా.. కడుపేదరికంలో పుట్టిన ఆయన తమ బతుకుల్లో వెలుగులు రావాలంటే చదవు ఒక్కటే మార్గమని గ్రహించాడు..తన ఇంటిపేరులో ఉన్న 'మైనం'ను స్ఫూర్తిగా తీసుకొని మొక్కవోని దీక్షతో చదువులో ముందడుగు సాగాడు. దీపం బుడ్డి వెలుగుల్లోనే పాఠాలు నేర్చుకున్నాడు..సామాన్య వ్యవసాయ కూలి స్థితి నుంచి జిల్లా సైన్స్ అధికారి స్థాయికి ఎదిగి అందరిచేత శభాష్ అనిపించుకున్నాడు. ఆయనే మన ఎన్టీఆర్ జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్..నేటి మన మిస్సైల్ మ్యాన్ హుస్సేన్ విజయగాథ ఇదీ..

చిన్ననాటి నుంచి చదువుపై ఆసక్తి..

ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలంలోని గంగదేవరపాడు అనే కుగ్రామంలో మైనం రామయ్య, శేషారత్నం దంపతులకు హుస్సేన్ జన్మించారు. హుస్సేన్‌బాబా దర్గాను సందర్శించిన తర్వాత పుట్టడంతో తల్లిదండ్రులు ఆయనకు హుస్సేన్ అని నామకరణం చేశారు. అమ్మిరెడ్డిగూడెంలోని ఏబీఎం హైస్కూల్‌లో టెన్త్ పూర్తిచేశారు. సైన్స్ సబ్జెక్ట్‌పై ఇష్టంతో తిరువూరులోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూప్‌లో చేరి ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యారు. నూజివీడు డీఏఆర్ కాలేజ్‌లో డిగ్రీ చదివిన ఆయన కాలేజ్ టాపర్‌గా నిలిచారు. విజయవాడ సిద్దార్థ కాలేజ్‌లో బీఈడీ పూర్తి చేసి తమ గురువులు భూమారావు, దావోజీ సూచనల మేరకు డీఎస్సీ-2000లో స్కూల్ అసిస్టెంట్‌గా విజయం సాధించారు.

రెండున్నర దశాబ్దాలుగా సేవలు..

విజయవాడ కార్పొరేషన్ పరిధిలో గత 24ఏళ్లుగా సైన్స్ టీచర్‌గా, జిల్లా సైన్స్ అధికారిగా డాక్టర్ మైనం హుస్సేన్ సేవలందిస్తున్నారు. ప్రస్తుతం పాయకాపురంలోని పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్లో ఫిజిక్స్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆయన భార్య పార్వతి గృహిణి కాగా, కుమారుడు జస్వంత్ విదేశాలలో ఎంఎస్ చదువుతున్నారు.

ఎన్నో అవార్డులు..రివార్డులు..:

దక్షిణ భారత జాతీయస్థాయి సైన్స్‌ఫేర్‌లలో 2014లో న్యూక్లియర్ ఎనర్జీకి.. 2015లో సూపర్ కండక్టివిటీకి.. 2016లో నానో టెక్నాలజీ ప్రాజెక్టులకు సంబంధించి వరుసగా మూడు జాతీయస్థాయి బుక్ ప్రైస్ అవార్డులను హుస్సేన్ మాస్టారు అందుకొని హ్యాట్రిక్ సాధించారు. జిల్లా కలెక్టర్ల నుంచి పదిసార్లు ప్రశంసా పత్రాలను.. జిల్లా విద్యాశాఖ అధికారులు నుంచి రెండుసార్లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా, 2022లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా అవార్డును అందుకున్నారు.

విద్యార్థులకు ఉచితంగా సొంత పుస్తకాలు..



ప్రభుత్వ పాఠశాలల్లోని టెన్త్ విద్యార్థులు భౌతికశాస్త్రంలో అధిక మార్కులు సాధించాలనే ఆకాంక్షతో హుస్సేన్ తాను సొంతంగా ఓ పుస్తకాన్ని రచించి, పదేళ్లుగా విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు, ప్రాజెక్టులపై అవగాహన పెంచడం, వారితో అనేక సైన్స్ కార్యక్రమాలను చేపట్టేందుకు కృషిచేస్తున్నారు.

నూతన ప్రయోగాలు చేయించాలనేది నాలక్ష్యం..

ఎన్టీఆర్ జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యార్థులందరికి సైన్స్ సబ్జెక్ట్‌పై పట్టును పెంచడం ..వారే స్వయంగా సరికొత్త పరికరాలను సృష్టించేలా.. వారే నూతన ప్రయోగాలు చేసేలా తీర్చిదిద్దాలనేది నాలక్ష్యం. ప్రతిఒక్కరూ సమాజానికి ఉపయోగపడేలా వారిని మంచివైపునకు నడిపించాలనేదే నా ఆశయం.

– డాక్టర్ మైనం హుస్సేన్

ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌లో స్వయంభూ శ్రీబాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవాలయంలో శనివారం సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు రంగావఝల ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కళ్యాణాన్ని కనుల పండువగా జరిపించారు. కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, ఆలయ ధర్మకర్తలు బోయిన గోపాలకృష్ణ, హరికృష్ణ దంపతులు, అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా దావుబుచ్చయ్యకాలనీ శ్రీ శ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయంలో అర్చకులు సాయితేజ శర్మ శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి కళ్యాణాన్ని వైభవంగా జరిపించారు. శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శనివారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

శ్రీనాగమానసాదేవి ఆలయంలో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లెనిన్ సెంటర్‌లోని ఓం షిర్డీసాయిబాబా, శ్రీ నాగమానసాదేవి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. నాగమానసాదేవి ఆలయంలో జంట నాగుల విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములు, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

శివరామకృష్ణ క్షేత్రంలో..

విజయవాడ కల్చరల్: శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి, విధుశేఖర మహాస్వామి ఆదేశంతో దుర్గాపురంలోని శివరామ కృష్ణ క్షేత్రంలోని సుబ్రహ్మమణ్య దేవాలయంలో షష్ఠి సందర్భంగా అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కంచి కామకోటి పీఠపాలిత లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వరస్వామి దేవాయలంలో ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం చైర్మన్ మాగంటి వేణుగోపాల్ ఆధ్వర్యంలో వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహించారు. మేనేజర్ శర్మ పాల్గొన్నారు.

పైపులైన్ పనుల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌లో పైపులైన్ పనుల కోసం తవ్విన రోడ్లకు మరమ్మతులు చేపట్టని వైనంపై 'తవ్వేసి..వదలివేస్తున్నారు...' శీర్షికన శనివారం 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన కథనానికి నగరపాలకసంస్థ వాటర్ వర్క్స్ అధికారులు స్పందించారు. ఏఈ నాగరాజు, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ తిరుమలరావుతో కలిసి 29వ డివిజన్ మధురానగర్‌లో వాటర్ పైపులైన్ పనులను వారు పరిశీలించారు.

ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పైపులైన్ పనుల కోసం తవ్విన ప్రతీ గొయ్యి పూడ్చి రాకపోకలకు వీలుగా తయారు చేయాలని వార్డు సచివాలయం ఎమినిటీ సెక్రటరీ లోకేష్‌ను ఆదేశించారు.

ఘన సత్కారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏపీ బిల్డింగ్స్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వైజర్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గొట్టుముక్కల రఘురామరాజును శనివారం శ్రీనగర్‌కాలనీకు చెందిన దేవరపు మాల్యాద్రి ఫ్రెండ్స్ సర్కిల్‌సభ్యులు గజమాలతో సత్కరించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.